
సాక్షి ఖమ్మం
ఆదివారం । 21 । ఏప్రిల్ । 2024



అమ్మో వడగాలులు
ఎండ, వడగాలులతో జనం అల్లాడిపోతున్నారు. ఈమేరకు జాగ్రత్తలపై వైద్య,ఆరోగ్యశాఖ వాల్‌పోస్టర్ల ద్వారా అవగాహన కల్పిస్తోంది. 8లో



నేటి నుంచి పవిత్రోత్సవాలు
ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లిలోని మారెమ్మ ఆలయంలో పవిత్రోత్సవాలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
41° / 26°

వాతావరణం
జిల్లా అంతటా ఆదివారం ఉదయం నుంచే ఎండ మొదలవుతుంది. మధ్యాహ్నానికి ఉష్ణోగ్రత గరిష్టస్థాయికి చేరుతుంది.

న్యూస్‌రీల్

జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా రాజగోపాల్

ఖమ్మం లీగల్: ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా జి.రాజగోపాల్ నియమితులయ్యారు. ప్రస్తుతం జిల్లా జడ్జిగా ఉన్న బీ.ఎస్.జగ్జీవన్ కుమార్‌ను హైదరాబాద్ కోఆపరేటివ్ అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్‌పర్సన్‌గా బదిలీ చేస్తూ హైకోర్టు శనివారం ఉత్తర్వులు జారీచేసింది. అలాగే, సత్తుపల్లి ఆరో అదనపు జిల్లా న్యాయమూర్తిగా ఎం.శ్రీనివాస్‌ను నియమించారు.

జమలాపురంలో ప్రత్యేక పూజలు



అన్నదానానికి విరాళం అందజేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి మూల విరాట్‌తో పాటు స్వామి పాదానికి అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించాక స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి నిత్యకల్యాణం జరిపించారు. అలాగే, శ్రీవారి పల్లకీసేవ నిర్వహించగా తెలంగాణ, ఏపీకి చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కాగా, ఆలయంలో శాశ్వత నిత్యాన్నదానానికి ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలం బూరుగుగూడెంకు చెందిన గుంటక సీతారెడ్డి దంపతులు లక్ష విరాళం ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మకు అందచేశారు. ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

వచ్చేనెల 26వరకు ప్యాసింజర్ రైళ్ల రద్దు

- కృష్ణా ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు

ఖమ్మం స్పోర్ట్స్: దక్షిణ మధ్య రైల్వే పరిధిలో మూడో లైన్ నిర్మాణ పనుల నేపథ్యాన ఈనెల 22నుంచి మే 26వ తేదీ వరకు ఖమ్మం మీదుగా నడిచే ప్యాసింజర్ రైళ్లను రద్దు చేసినట్లు కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఎం.డీ.జాఫర్ ఒక ప్రకటనలో తెలిపారు. భద్రాచలంరోడ్డు – విజయవాడ(07278), విజయవాడ – భద్రాచలం రోడ్డు(07979) ప్యాసింజర్లతో పాటు కాజీపేట – డోర్నకల్ జంక్షన్(07753), డోర్నకల్ జంక్షన్ – కాజీపేట(07554) ప్యాసింజర్ రైళ్లను రద్దు చేశామని పేర్కొన్నారు. అంతేకాకుండా డోర్నకల్ – విజయవాడ(07755), విజయవాడ – డోర్నకల్(07756) ప్యాసింజర్ రైళ్ల రద్దు కూడా మే 26వరకు అమల్లో ఉంటుందని తెలిపారు. ఇక తిరుపతి – ఆదిలాబాద్ కృష్ణా ఎక్స్‌ప్రెస్(17405) రైలు ఈనెల 29నుంచి మే 10వ తేదీ వరకు, మే 16నుంచి 22వ తేదీ వరకు గూడూరు, తెనాలి, గుంటూరు మీదుగా సికింద్రాబాద్‌కు చేరుకుని యథావిధిగా ఆదిలాబాద్ చేరుకుంటుందని పేర్కొన్నారు. అలాగే, ఆదిలాబాద్ – తిరుపతి కృష్ణా ఎక్స్‌ప్రెస్(17406) రైలును ఈనెల 28నుంచి మే 9వ తేదీ వరకు, మళ్లీ మే 15వ తేదీ నుంచి 21వ తేదీ వరకు దారి మళ్లించనున్నట్లు తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం

ఖమ్మంలీగల్: చట్టాలపై పారాలీగల్ వలంటీర్లు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి మహ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా సూచించారు. ఖమ్మంలోని న్యాయసేవాధికార సంస్థ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. న్యాయం అందరికీ సమానంగా అందుతుందనే విషయాన్ని ప్రతీఒక్కరికీ అవగాహన కల్పించే బాధ్యత వలంటీర్లపై ఉందన్నారు. కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్‌లను వినియోగించుకునేలా కృషి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో పారా లీగల్ వలంటీర్లు నాగమణి, సుశీల, మమత, సునీత, మానస, శంకర్‌రావు, బిస్మిల్లా, కృష్ణ, అన్నపూర్ణ పాల్గొన్నారు.


ఉదయం 6 గంటలకే పనిలోకి రావాలి

కొణిజర్ల: ఉపాధి హామీ కూలీలు ఎండ తీవ్రత దృష్ట్యా ఉదయం 6గంటలకే వచ్చి 11 గంటల వరకు పనిచేయాలని డీఆర్‌డీఓ సన్యాసయ్య సూచించారు. మండలంలోని తనికెళ్ల, చిన్నగోపతి గ్రామాల్లో ఉపాధి పనులను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పనిప్రదేశాల్లో వసతులపై సిబ్బంది మాట్లాడి ప్రథమ చికిత్స, నీడ, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అలాగే, లోక్‌సభ ఎన్నికల్లో ప్రలోభాలకు లొంగకుండా తప్పనిసరి ఓటు హక్కు వినియోగించుకోవాలని కూలీలకు సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ ఏ.రోజారాణి, ఉద్యోగులు అమ్మాజాన్, సునీల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్‌ఎస్ పరిస్థితి మూడు అడుగులు ముందుకు.. ఆరడుగులు వెనక్కి అన్న చందంగా మారింది. ఓ వైపు లోక్‌సభ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రచారం నిర్వహిస్తుండగా.. మరోవైపు ఎప్పుడు ఎవరు పార్టీని వీడుతారో తెలియని అనిశ్చితి నెలకొంది. బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన ఏకైక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఇప్పటికే కాంగ్రెస్ గూటికి చేరారు. తాజాగా వైరా మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ రాజీనామా చేశారు. ఇక పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉంటున్నారు. అలాగే, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన కార్పొరేటర్లు ఇప్పటికే పలువురు 'హస్తం' గూటికి చేరగా.. శనివారం 16వ డివిజన్ కార్పొరేటర్ మేడారపు వెంకటేశ్వర్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షాన కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. లోక్‌సభ పోలింగ్ సమీపించే కొద్దీ మరికొందరు బీఆర్‌ఎస్ ముఖ్య నేతలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు పార్టీని వీడుతారనే ప్రచారం జరుగుతోంది. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

ముందుకు.. వెనక్కి!

ఉమ్మడి జిల్లా బీఆర్‌ఎస్‌లో నిస్తేజం
- వరుసగా పార్టీని వీడుతున్న నేతలు
- పార్లమెంట్ ఎన్నికల వేళ 'కారు'లో కంగారు
- కాంగ్రెస్‌లో చేరనున్న మాజీ ఎమ్మెల్యే రాములునాయక్
- అదేబాటలో మరికొందరు ప్రజాప్రతినిధులు



గతమెంతో ఘనం..
తెలంగాణ ఏర్పడిన తొలి దఫా ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి పోటీకి అభ్యర్థులను వెతుక్కోవాల్సి వచ్చింది. 2014 ఎన్నికల్లో కొత్తగూడెం నుంచి జలగం వెంకట్రావు మాత్రమే విజయం సాధించారు. ఆ తర్వాత రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో బీఆర్‌ఎస్‌లోకి వలసలు మొదలయ్యాయి. కాంగ్రెస్, ఇతర పార్టీల్లో గెలిచిన ప్రజాప్రతినిధులు బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఆ తర్వాత ఎన్నికల్లోనూ ఖమ్మం నుంచి పువ్వాడ అజయ్‌కుమార్ మాత్రమే గెలుపొందినా ఎమ్మెల్యేల వలసలు కొనసాగాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత బీఆర్‌ఎస్‌లో చేరడమే తప్ప, పార్టీని వీడిన వారు అతి తక్కువ మంది ఉన్నారు. 2018 ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన లావుడ్యా రాములునాయక్, కాంగ్రెస్ నుంచి గెలుపొందిన కందాళ ఉపేందర్‌రెడ్డి, హరిప్రియ, వనమా వెంకటేశ్వరరావు, రేగా కాంతారావు, టీడీపీ నుంచి గెలుపొందిన సండ్ర వెంకటవీరయ్య, మెచ్చా నాగేశ్వరరావు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఇలా అన్ని పార్టీల నుంచి వచ్చిన నేతలతో బీఆర్‌ఎస్ కళకళలాడుతూ కనిపించింది.

'అసెంబ్లీ' ఓటమితో..
తాజా అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోవడంతో బీఆర్‌ఎస్‌కు సంకట పరిస్థితి ఎదురవుతోంది. గతంలో పార్టీలోకి వలసలు ఎలా కొనసాగాయో.. ఇప్పుడు నిష్క్రమణలు కూడా అలాగే జరుగుతున్నాయి. వైరా మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ తాజాగా బీఆర్‌ఎస్‌ను వీడగా, ఆయన కాంగ్రెస్‌లో చేరనున్నట్లు సమాచారం. ఏన్కూరు మండల అధ్యక్షుడు బానోతు సురేష్‌నాయక్ సైతం రాజీనామా చేశారు. మాజీ ఎమ్మెల్యే రాములునాయక్ ఆదివారం వైరాలో ముఖ్య అనుచరులతో సమావేశమై ఏ పార్టీలో చేరతారనే నిర్ణయాన్ని ప్రకటించనున్నట్లు తెలిసింది. అలాగే ఖమ్మం కార్పొరేషన్‌లో పలువురు కార్పొరేటర్లు బీఆర్‌ఎస్‌కు గుడ్‌బై చెప్పారు. ఇంకొందరు సైతం వారం రోజుల్లో పార్టీని వీడనున్నట్లు తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికల వేళ ఈ రాజీనామాలు పార్టీకి తలనొప్పి తెచ్చి పెడుతున్నాయి. పార్టీని వీడతారనే అనుమానం ఉన్న నేతలను బుజ్జగించేందుకు జిల్లా, రాష్ట్రస్థాయి నేతలు ప్రయత్నాలు చేస్తున్నా ఫలించడం లేదు.

సమన్వయం లొల్లి..
ఖమ్మం లోక్‌సభ పరిధిలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ప్రచారానికి సమన్వయకర్తల పేర్లతో కేటీఆర్ పేరిట ఇటీవల ప్రకటన వెలువడింది. ఈ నియామకాలు పార్టీలో నేతల మధ్య చిచ్చు పెట్టాయి. నియామకాల్లో సామాజిక సమీకరణలను పరిగణనలోకి తీసుకోలేదని ముఖ్య నేతల తీరుపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. నియోజకవర్గ నేతలకు ప్రాధాన్యత ఇవ్వకుండా ఇష్టానుసారంగా నియమించారని బహిరంగంగానే విమర్శించారు. దీంతో జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ స్పందించారు. త్వరలోనే జిల్లా పార్టీ ముఖ్యులతో చర్చించి, సామాజిక అంశాలను పరిగణనలోకి తీసుకొని నియోజకవర్గ సమన్వయ కమిటీలను ప్రకటిస్తామని వెల్లడించాల్సి వచ్చింది.

ముందు నుంచే అసంతృప్తి..
వైరా మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్‌కు గత ఏడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ కేటాయించలేదు. దీంతో ఆయన తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. ఉమ్మడి జిల్లాలో సిట్టింగ్‌లందరికీ టికెట్లు ఇచ్చి తనకు ఇవ్వకపోవడం ఏంటని ఒక దశలో ప్రశ్నించగా.. కేసీఆర్ తదితరులు బుజ్జగించడంతో మెత్తబడ్డారు. వైరాలో పార్టీ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్‌తో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. కేసీఆర్‌తోపాటు పలు సభల్లో ప్రచారంలో పాల్గొనగా.. కేసీఆర్ ఆయనను అభినందించారు. అయితే లోక్‌సభ ఎన్నికల్లో తన కుమారుడికి టికెట్ ఇప్పించుకోవాలని ప్రయత్నాలు చేసినట్లు తెలిసింది. తనకు అసెంబ్లీ టికెట్ కేటాయించకపోవడం, లోక్‌సభ ఎన్నికల్లోనూ కుమారుడికి మొండిచేయి చూపడంతో నిరుత్సాహానికి గురై పార్టీని వీడినట్లు తెలిసింది.

29న ఖమ్మంకు కేసీఆర్

రెండు రోజుల పాటు ఉమ్మడి జిల్లాలో బస్సుయాత్ర



సాక్షిప్రతినిధి, ఖమ్మం: గులాబీ దళపతి, మాజీ సీఎం కేసీఆర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 29న ఖమ్మం నగరానికి రానున్నారు. రెండు రోజుల పాటు ఆయన ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాల పరిధిలో పర్యటిస్తారు. బస్సుయాత్రలో భాగంగా ఉమ్మడి జిల్లాలో ఆయన పర్యటన షెడ్యూల్ శనివారం విడుదలైంది. ఈ షెడ్యూల్ ప్రకారం ఈనెల 28వ తేదీన వరంగల్‌లో రోడ్డు షో ముగించుకుని 29న కేసీఆర్ ఖమ్మం చేరుకుంటారు. ఆ రోజు ఖమ్మం బీఆర్‌ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు తరఫున ప్రచారంలో భాగంగా జిల్లా కేంద్రంలో జరిగే రోడ్డుషోలో పాల్గొని ఇక్కడే బస చేస్తారు. ఇక 30న సాయంత్రం తల్లాడ రోడ్డు షోలో పాల్గొని కొత్తగూడెం వెళ్లి అక్కడ రోడ్డు షోలో ప్రసంగిస్తారు. ఆ రోజు రాత్రి కొత్తగూడెంలో బస చేయనున్న కేసీఆర్.. మరుసటి రోజు టేకులపల్లి, ఇల్లెందు మీదుగా మహబూబాబాద్ వెళ్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి మాలోతు కవిత తరఫున ప్రచార సభల్లో మాట్లాడతారు. సిట్టింగ్ స్థానాలైన ఖమ్మం, మహబూబాబాద్ సీట్లను దక్కించుకోవడంలో భాగంగా బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పర్యటనను విజయవంతం చేసేందుకు పార్టీ ముఖ్య నేతలు ఇప్పటికే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

కాంగ్రెస్‌కు అభ్యర్థే లేరు...



మాట్లాడుతున్న మాజీ మంత్రి అజయ్‌కుమార్, పక్కన నామ, వద్దిరాజు, మధు, మదన్‌లాల్ తదితరులు

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

- సంక్షేమ పథకాలపై ప్రభుత్వం చేతులెత్తేసింది
- మాజీ మంత్రి అజయ్, ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్సీ మధు
- బీఆర్‌ఎస్ అభ్యర్థి నామ విజయానికి శ్రేణులు పాటుపడాలని పిలుపు

కొణిజర్ల/ఏన్కూరు: లోక్‌సభ ఎన్నికల్లో నామినేషన్ల ప్రక్రియ మొదలైనా కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థి లేక గందరగోళ పరిస్థితుల్లో పడిపోయారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. కొణిజర్ల మండలం శాంతినగర్‌లో మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ అధ్యక్షతన నిర్వహించిన కొణిజర్ల ముఖ్య కార్యకర్తల సమావేశంతోపాటు ఏన్కూరులో నిర్వహించిన ఏన్కూరు, జూలూరుపాడు మండలాల కార్యకర్తల సమావేశాల్లో వారు ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తామంటూ మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు చేతులెత్తేసిందన్నారు. దీంతో ప్రజలు మోసపోయినట్లుగా గుర్తించారని తెలిపారు. సాగు, తాగునీరు అందక రైతులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. రుణమాఫీని విస్మరించగా, రైతుబంధు సక్రమంగా అమలుచేయలేదని ఆరోపించారు. రాష్ట్రంలో సంక్షేమ రాజ్యం పోయి సంక్షోభ రాజ్యం నడుస్తోందని, ప్రజలు కాంగ్రెస్ వద్దు.. కేసీఆర్ ముద్దు అంటున్నారని తెలిపారు. కొందరు నాయకులు తల్లి లాంటి పార్టీని వదిలివెళ్లినా.. కార్యకర్తలు బలంగా ఉన్నందున కలిసికట్టుగా ప్రభుత్వం వైఫల్యాలు, గతంలో కేసీఆర్ అందించిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ వివరిస్తూ నామ నాగేశ్వరావును విజయానికి పాటుపడాలని కోరారు. ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు మాట్లాడుతూ ఈనెల 24 న ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా నామ నాగేశ్వరరావు నామినేషన్ దాఖలు చేస్తారని తెలిపారు. జెడ్పీటీసీ బాదావత్ బుజ్జీ, నాయకులు వై.చిరంజీవి, పాముల వెంకటేశ్వర్లు, బోడపోతుల బాబు, దొడ్డపిన్ని రామారావు, చెరుకుమల్లి రవి, కిలారు కిరణ్, కృష్ణార్జునరావు, సీతారాములు, వెంకటేశ్వర్లు, యల్లంకి సత్యనారాయణ, వాసిరెడ్డి వెంకటేశ్వర్లు, పొన్నం హరికృష్ణ పాల్గొన్నారు.

ప్రజలను మధ్యయుగంలోకి తీసుకెళ్లేలా పాలన

- బీజేపీ, మిత్రపక్షాలను ఓడించాలి
- 'ఇండియా' కూటమికి మద్దతు
- మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



సమావేశంలో మాట్లాడుతున్న రంగారావు

ఖమ్మంమయూరిసెంటర్: కార్పొరేట్ వర్గాలకు దేశాన్ని దోచి పెట్టడంతో పాటు, ప్రజలను మధ్యయుగాల్లోకి తీసుకెళ్లేందుకు బీజేపీ మూఢనమ్మకాలు, మనువాద చాందస భావాలను నూరిపోయడమే కాక రాజ్యాంగాన్ని మార్చే కుట్రలు చేస్తోందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఆరోపించారు. ఈ నేపథ్యాన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ మిత్రపక్షాలను ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కెచ్చెల రంగారెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. మతాల పేరుతో దేశం, ప్రజలను విభజిస్తున్న బీజేపీ కుల వ్యవస్థను పెంచి పోషిస్తోందని తెలిపారు. మైనార్టీలకు పౌరసత్వం లేదంటూ గుజరాత్, అహ్మదాబాద్, మణిపూర్‌లో ఊచకోత కోశారని రంగారావు ఆరోపించారు. కార్పొరేట్ శక్తుల కోసం శ్రమజీవుల మధ్య ఐక్యతను దెబ్బతీస్తున్నారని విమర్శించారు. ఫాసిజం వస్తే కనీస ప్రజాస్వామిక హక్కులు ఉండవని, ప్రతిపక్షాలను కూడా ఉండనివ్వరని తెలిపారు. ఇప్పటికే ప్రతిపక్షాలపై సీబీఐ, ఈడీ, ఐటీలను ప్రయోగిస్తుండగా.. ప్రశ్నిస్తున్న వారితో పాటు సామాన్యులపై ఉపా కేసులు పెడుతూ వేధిస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యాన బీజేపీ, ఆ పార్టీ మిత్రపక్షాలను ఓడించేందుకు ఇండియా కూటమికి ఓటు వేయాలని రంగారావు పిలుపునిచ్చారు. ఈసమావేశంలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య, నాయకులు రాయల చంద్రశేఖర్, గోకినేపల్లి వెంకటేశ్వరరావు, చండ్ర అరుణ, గుర్రం అచ్చయ్య, బందెల వెంకయ్య, ముద్దా బిక్షం, కెచ్చెల కల్పన, కల్లూరి కిషోర్, అమర్లపూడి రాము, నూపా భాస్కర్, కంగాల కల్లయ్య, బి.వెంకన్న, శాంతయ్య, అజయ్, బోసు, సీవై.పుల్లయ్య, జి.రామయ్య, ఆవుల అశోక్, కె.అర్జున్‌రావు, కె.నాగేశ్వరరావు, శిరోమణి, ఝాన్సీ, మంగతాయి, పి.శోభ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విజయం.. అభివృద్ధికి దోహదం



సదస్సులో మాట్లాడుతున్న శిల్పారెడ్డి

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గం అభివృద్ధికి బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు గెలవడం తప్పనిసరని పార్టీ మహిళా మోర్చా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శిల్పారెడ్డి, సుధాపాటిల్ అన్నారు. ఖమ్మంలో శనివారం నిర్వహించిన సదస్సులో వారు మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను విస్మరించిన విషయాన్ని వివరిస్తూ బీజేపీకి ఓటు వేసేలా ప్రచారం చేయాలని శ్రేణులకు సూచించారు. కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, అభ్యర్థి వినోద్‌రావు మాట్లాడగా నాయకులు విజయారెడ్డి, నందికొండ గీతారెడ్డి, సరస్వతి, అరుణ, అనిత తదితరులు పాల్గొన్నారు. కాగా, కాచిరాజుగూడెంకు చెందిన సీపీఎం కార్యకర్తలు పలువురు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నున్న రవి ఆధ్వర్యాన బీజేపీలో చేరగా వినోద్‌రావు కండువా కప్పి ఆహ్వానించారు.

రూ.48,63,300 విలువైన సొత్తు స్వాధీనం

ఖమ్మం సహకారనగర్: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి శనివారం వరకు 517మందిపై 471 కేసులు నమోదు చేయగా.. రూ.48,63,300 విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు వ్యయ పరిశీలన సెల్ నోడల్ అధికారి మురళీధర్‌రావు తెలిపారు. అయితే, ఇందులో నగదుకు సంబంధించి 40 కేసుల్లో బాధ్యులు ఆధారాలను సమర్పించడంతో తిరిగి ఇచ్చేసినట్లు పేర్కొన్నారు. పోలీస్ శాఖకు సంబంధించి 184మంది వ్యక్తులపై 94 కేసులు నమోదు కాగా రూ.8,00,931 విలువైన సొత్తు, ఎక్సైజ్ శాఖకు సంబంధించి 333మందిపై 377 కేసులు నమోదు చేసి రూ.40,62,369 విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఇవి కాకుండా రూ.3.50లక్షల విలువైన పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకుని నాలుగు కేసులు నమోదు చేశామని మురళీధర్‌రావు తెలిపారు.


మూడో రోజు.. రెండు నామినేషన్లు



ఆర్‌ఓ గౌతమ్‌కు నామినేషన్ సమర్పిస్తున్న స్వతంత్ర అభ్యర్థి బాజీబాబా

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం లోక్‌సభ స్థానానికి శనివారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. స్వతంత్ర అభ్యర్థిగా ఖమ్మం వెలుగుమట్ల ప్రాంతానికి చెందిన షేక్ బాజీబాబా ఒక సెట్ నామినేషన్ సమర్పించారు. అలాగే, అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్(ఆధార్) పార్టీ అభ్యర్థిగా కుక్కల నాగయ్య రెండో సెట్ సమర్పించారని ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ వెల్లడించారు.

పకడ్బందీగా వ్యయ నమోదు



మాట్లాడుతున్న శంకర్‌నంద్ మిశ్రా

ఖమ్మం సహకారనగర్: లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థుల వ్యయం వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలని ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు అరుణ్‌ప్రసాత్ కృష్ణస్వామి, శంకర్‌నంద్ మిశ్రా సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సహాయ వ్యయ పరిశీలకులు, అకౌంటింగ్ బృందాలకు శనివారం అవగాహన కల్పించారు. ఎన్నికల్లో ధన, మద్యం, ప్రలోభాల నియంత్రణకు అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు. అభ్యర్థి నామినేషన్ వేసినప్పటి నుండి ప్రతీ ఖర్చు ఖాతాలో చూపేలా అవగాహన కల్పించాలని, ఈ వివరాలతో షాడో రిజిస్టర్లు నిర్వహించాలని సూచించారు. జిల్లా సహకార అధికారి మురళీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వదిలేసినట్లేనా..?

- కేసులతో జైలు పాలైన చంద్రాయపాలెం ఆదివాసీలు
- పాలకపక్షం నేతల పరామర్శలు కరువై ఆవేదన
- పోలీసులపై దాడితో పోడు ఉద్యమం పక్కదారి



పోడు ఉద్యమంలో పాల్గొన్న గిరిజనులు (ఫైల్) (ఇన్‌సెట్) చంద్రాయపాలెంలోని వివాదాస్పద అటవీభూమి

సత్తుపల్లి: గత పాలకులు సహకరించకపోగా, ఈసారి పాలక పార్టీ మద్దతు తమకే ఉందని భావిస్తూ పోరాడితే భూమి దక్కుతుందని ఆదివాసీ, గిరిజనులు పోరుబాట పట్టారు. కానీ సత్తుపల్లి పట్టణ సీఐ కిరణ్, పోలీసులపై దాడి జరగడంతో అండగా ఉంటామన్న వారంతా వదిలేయడంతో గిరిజనుల్లో ఆవేదన వ్యక్తమవుతోంది. మండలంలోని చంద్రాయపాలెం భూపోరాటం పాలకపార్టీ మద్దతుతో జరగడంతో ఈసారి ఎలాగైనా భూమి దక్కుతుందనే ఆశతో గిరిజనులు పోడు ఉద్యమాన్ని తీవ్రం చేశారు. అటవీ, రెవెన్యూ శాఖలు జాయింట్ సర్వే నిర్వహిస్తే పూర్వీకుల భూములు తమకు దక్కుతాయని ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నారు. ఇంతలోనే గతనెల 31న జరిగిన ఘటనలో పోలీసులు గాయపడడంతో ఇప్పటికి 92 మంది గిరిజనులు ఐదు కేసుల్లో జైలు పాలయ్యారు. భూమి సాధించేందుకు జరిగిన పోరాటం హింసాత్మకంగా మారడంతో ఎన్నడూ లేని విధంగా పోలీసులు ఉక్కుపాదం మోపడంతో గిరిజనులు ఏం చేయాలో పాలుపోని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

పోడు పోరాటంతోనే..
సత్తుపల్లి మండలంలో పోడు పోరాటంతో మూడు వేల ఎకరాల వరకు పట్టాలు సాధించిన చరిత్ర ఉంది. వామపక్ష నేపథ్యం కలిగిన పార్టీలు సుదీర్ఘంగా ఇక్కడ భూపోరాటాలు నిర్వహించాయి. రుద్రాక్షపల్లిలో బాసారం భూపోరాటాన్ని ఇప్పటికీ గుర్తుచేసుకుంటారు. సుమారు 2వేల ఎకరాల కోసం జరిగిన పోరాటంలో గిరిజనులు పట్టాలు సాధించుకున్నారు. అక్కడ సత్యంపేట గిరిజన గ్రామమే వెలిసింది. బాసారం భూపోరాటంలో సుదీర్ఘ కాలం పోలీస్ పికెట్ నడిచినా ఒక్క దాడి కూడా జరగలేదు. అలాగే బుగ్గపాడు, గాంధీనగరం, రేగళ్లపాడు, చంద్రాయపాలెం, గుడిపాడు, యాతాలకుంట, కాకర్లపల్లిల్లోనూ పట్టాలు సాధించుకున్నారు. వామపక్ష నేపథ్యంలో జరిగిన ఉద్యమాలు కావడంతో అటవీ, పోలీసులు నిర్బంధాలు, కేసులు పెట్టినా శాంతిభద్రతల సమస్య తలెత్తలేదు. సీతారామ ప్రాజెక్టు కింద భూమి కోల్పోయిన పట్టాలు కలిగిన పోడు రైతులకు రూ.కోటి మేర పరిహారం కూడా అందింది. ఇదేసమయాన చంద్రాయపాలెంలో భిన్నమైన పరిస్థితులు నెలకొనడంతో ఎలాంటి పరిష్కారం లభిస్తుందోనని గిరిజనులు చూస్తున్నారు.

పరామర్శించే వారు లేక...
పోలీసులపై దాడి కేసులో గిరిజనులు జైలు పాలుకాగా.. వారి పక్షాన మాట్లాడేందుకు పాలక పార్టీకి చెందిన నాయకులెవరూ ముందుకు రాకపోవడం వారిలో ఆవేదనకు కారణమవుతోంది. అసలేం జరిగింది, ఎంతమంది అరెస్ట్ అయ్యారనే వివరాలు ఆరా తీసి ధైర్యం చెప్పకపోవటంపై గిరిజన కుటుంబాలు ఆక్రోశిస్తున్నాయి. ఇదేసమయాన మాస్‌లైన్ పార్టీ, పౌరహక్కుల సంఘం నేతలు గిరిజనులను పరామర్శించి జైలు పాలైన వారికి న్యాయ సాయం అందించేందుకు ముందుకొస్తున్నట్లు తెలిసింది. జైలుకు వెళ్లిన మహిళల్లో కొందరికి చిన్న పిల్లలు ఉన్నందున మానవతా దృష్టితో సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు.

క్లుప్తంగా

ప్రభుత్వ డ్రైవర్ల సంఘం సభ్యత్వాలు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల సంఘానికి సంబంధించి సభ్యత్వాలు స్వీకరిస్తున్నట్లు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హకీం తెలిపారు. ఖమ్మం టౌన్ అధ్యక్షుడు అబ్బు రాములు, కొత్తగూడెం డివిజన్ కన్వీనర్ వనమా శ్రీనివాసరావు, భద్రాచలం డివిజన్ కోకన్వీనర్ కుంజా రాఘవులు వద్దే సభ్యత్వాలు తీసుకోవాలని, సంఘం పేరుపై ఎవరైనా సభ్యత్వాలు స్వీకరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గిరిజన ఉపాధ్యాయుడికి డాక్టరేట్


హట్కర్ బాలాజీ

కామేపల్లి: మండలంలోని గోవింద్రాలకు చెందిన గిరిజన ఉపాధ్యాయుడు హట్కర్ బాలాజీకి డాక్టరేట్ లభించింది. మహబూబాబాద్ జిల్లా దామరవంచ తెలంగాణ గిరిజన గురుకుల విద్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఆయనకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది.

జర్మనీలో పరిశోధనకు అవకాశం


సాయికుమార్

కూసుమంచి: మండలంలోని కోక్యాతండాకు చెందిన హలావత్ సాయికుమార్‌కు జర్మనీలోని కార్ల్స్రూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో వరిపై పరిశోధన చేసే అవకాశం లభించింది. వరిలో నీటి ఎద్దడిని తట్టుకునే వంగడాల రూపకల్పనపై పరిశోధనకు అక్కడి ప్రభుత్వం అనుమతించిందని సాయికుమార్ తెలిపారు. ప్రస్తుతం ఆయన ఉత్తరప్రదేశ్‌లోని సామ్ హిగ్గిన్ బాటమ్ యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ టెక్నాలజీ సైన్సెస్‌లో జన్యుశాస్త్రంలో పీహెచ్‌డీ చేస్తున్నారు.

తాగునీటి విషయంలో నిర్లక్ష్యం చేయొద్దు


సమీక్షలో మాట్లాడుతున్న జెడ్పీసీఈఓ వినోద్

నేలకొండపల్లి: ప్రజలకు తాగునీటి సరఫరా విషయంలో నిర్లక్ష్యం చేయొద్దని జిల్లా పరిషత్ సీఈఓ ఎస్.వినోద్ ఆదేశించారు. నేలకొండపల్లి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయన అధికారులతో సమావేశమయ్యారు. తాగునీటి వనరులు, లభ్యత ఆధారంగా ప్రజలకు సరఫరా చేయాలని, సమస్య తీవ్రత ఉన్న చోట బోర్లు, బావులను అద్దెకు తీసుకోవాలని తెలిపారు. అలాగే, ఉపాధి హామీ కూలీలు ఉదయం 6గంటలకల్లా పని ప్రదేశానికి చేరుకునేలా చూస్తూ నీడ, తాగునీటి వసతి కల్పించాలని సూచించారు. ఎంపీడీఓ ఎం.ఎర్రయ్య, ఎంపీఓ సీ.హెచ్.శివ, ఉద్యోగులు ఆర్.సునీత, శేషగిరిరావు పాల్గొన్నారు.

భర్త ఇంటి ముందు భార్య ఆందోళన

సత్తుపల్లిటౌన్: న్యాయం చేయాలని కోరుతూ భర్త ఇంటి ఎదుట మహిళ ఆందోళనకు దిగిన ఘటన సత్తుపల్లిలో శనివారం చోటుచేసుకుంది. సత్తుపల్లికి చెందిన సతీశ్‌తో వెంకటాయపాలెంనకు చెందిన సంపూర్ణకు 2018లో వివాహమైంది. కొంతకాలం సఖ్యతగా కాపురం సాగినా తన అత్త మాటలు విన్న సతీశ్ వేధించాడని, కుమారుడు పుట్టాక కూడా మార్పు రాలేదని సంపూర్ణ తెలిపింది. అత్త, ఆడపడుచు, భర్త ఆహారం కూడా సక్రమంగా పెట్టకుండా ఇబ్బంది పెట్టడమే కాక తనను వదిలించుకోవాలని చూస్తుండటంతో పుట్టింటి వారితో కలిసి సత్తుపల్లి బైపాస్‌లోని సతీశ్ ఇంటి ఎదుట నిరసన తెలిపింది. ఈ విషయం పోలీసుల దృష్టికి వెళ్లడంతో ఇరువర్గాలను పిలిపించారు.

యువకుడిపై ఫిర్యాదు

కల్లూరురూరల్: తనను ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ యువకుడు మోసం చేశాడని మండలంలోని చండ్రుపట్లకు చెందిన యువతి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వైరా మండలం తాడిపూడికి చెందిన కాంపెల్లి ప్రణీత్, ఆమె, కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. పెళ్లి చేసుకుంటానని చెప్పి ఇప్పుడు మాట తప్పాడని యువతి ఫిర్యాదులో పేర్కొంది. ఈమేరకు ఆయన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరింది.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి

ఖమ్మంరూరల్: మండలంలోని కాచిరాజుగూడెం శివారు వాల్యాతండా వద్ద పురుగుల మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా ముల్కలపల్లికి చెందిన తరుణ్ డిగ్రీ చదివాక ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసైన ఆయన పని చేయకపోవడంతో తల్లిదండ్రులు ఉద్యోగ పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. అయితే, మద్యానికి బానిసైన తరుణ్ ఈనెల 15న వాల్యాతండా వద్ద పురుగుల మందు తాగగా స్థానికులు ఖమ్మం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడని ఎస్‌ఐ రామారావు తెలిపారు.

కోదాడ రోడ్డులో ఏర్పడిన ఎండమావులు



అమ్మో వడగాలులు

జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. శనివారం భానుడు కొంత శాంతించినా, వడగాలులు మాత్రం తగ్గలేదు. దీంతో జనం బయటకు రావాలంటే జంకే పరిస్థితులు నెలకొన్నాయి. మధ్యాహ్నం తర్వాత అంతా ఇళ్లకే పరిమితం కావడంతో జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా కనిపించాయి. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్


నిర్మానుష్యంగా ఉన్న బైపాస్‌రోడ్డు


అవగాహన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ గౌతమ్, అధికారులు

అప్రమత్తంగా ఉండాలి

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నందున వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యాన రూపొందించిన అవగాహన పోస్టర్లను శనివారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించి మాట్లాడారు. ఎండదెబ్బ తగలకుండా ప్రజలు ఉదయం 11నుండి సాయంత్రం 4గంటల మధ్య అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని తెలిపారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంల వద్ద, అంగన్‌వాడీ కేంద్రాలు, పీహెచ్‌సీల్లో ఓఆర్‌ఎస్ ద్రావణం అందుబాటులో ఉన్నందున వినియోగించుకోవాలని సూచించారు. ప్రతిరోజు సరిపడా తాగునీరు తీసుకోవడంతో పాటు కాటన్ దుస్తులు ధరించాలని, ద్విచక్ర వాహనాలపై దూర ప్రయాణాలు చేయొద్దని తెలిపారు. కాగా, వైద్య, ఆరోగ్య అధికారులు వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మాలతి, ఆర్టీసీ డిప్యూటీ ఆర్‌ఎం పవిత్ర, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సైదులు, సీలోహన తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు సైబర్ నేరగాళ్ల అరెస్ట్

ఉద్యోగాల పేరిట డబ్బు వసూళ్లు

ఖమ్మంక్రైం: నిరుద్యోగ యువతే లక్ష్యంగా మోసాలకు పాల్పడుతున్న ఇద్దరు సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. నల్లగొండ జిల్లాకు చెందిన పారేపల్లి సాయికృష్ణ అలియాస్ సాయి, ఆయన సహచరుడు పెట్రోల్ బంక్ ఉద్యోగి రావులపాటి శివ హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్‌లో నివాసముంటున్నారు. వివిధ ఇంజినీరింగ్ కాలేజీల హెచ్‌ఓడీలకు సంబంధించిన ఫోన్ నంబర్లను వెబ్‌సైట్ల ద్వారా సేకరించిన వారు అదే కాలేజీ పూర్వవిద్యార్థులుగా, ఐబీఎం ఉద్యోగులుగా చెబుతూ పలు మల్టీనేషన్ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కలిస్తామని నమ్మించారు. దీంతో కాలేజీల హెచ్‌ఓడీలు ప్లేస్‌మెంట్ల కోసం సంప్రదించాలని వీరి ఫోన్ నంబర్లను కాలేజీల వాట్సప్ గ్రూపులో పోస్ట్ చేశారు. దీంతో నిరుద్యోగ యువత, విద్యార్థులు ఆయా నంబర్లకు ఫోన్‌చేయగా తొలుత రూ.35 వేలు, జీతం వచ్చాక మరో రూ.35 వేలు చెల్లించాలని సూచించారు. ఈ క్రమంలోనే ఖమ్మంకు చెందిన ఇద్దరు యువతులు రూ.70 వేలు చెల్లించాక కొద్దిరోజులకే ఫోన్ స్విచాఫ్ రావడంతో మోసపోయినట్లు గుర్తించి మార్చి 27న సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణలో భాగంగా నిందితుల చేతిలో ఖమ్మంతో పాటు కరీంనగర్, నల్లగొండ, హైదరాబాద్, జగిత్యాల, గుంటూరు, రాజమండ్రి జిల్లాలో సుమారు 50 మంది మోసపోయారని తేలింది. ఐపీఎల్‌లో బెట్టింగ్, జల్సాలకు అలవాటు పడిన నిందితులను ఖమ్మం కొత్త బస్టాండ్‌లో ఈ నెల 18న అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామని సీపీ ఒక ప్రకటనలో వెల్లడించారు. సైబర్ పోలీస్ స్టేషన్‌లో మొదటి కేసును సమర్థవంతంగా ఛేదించిన ఏసీపీ ఫణీంద్ర, సీఐ శివకుమార్, ఎస్‌ఐలు రంజిత్, విజయ్‌కుమార్‌ను ఆయన అభినందించారు.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

కూతురు ప్రేమ వివాహంతో మనస్తాపం


విజయలక్ష్మి (ఫైల్)

బోనకల్: తమ నిర్ణయానికి విరుద్ధంగా కూతురు ప్రేమ వివాహం చేసుకుందనే మనస్తాపంతో ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం ముష్టికుంట్ల గ్రామంలో శనివారం జరిగిన ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, మధిర మార్కెట్ మాజీ చైర్మన్ బంధం శ్రీనివాసరావు – విజయలక్ష్మి (50)కి ఇద్దరు కుమార్తెలున్నారు. వీరి రెండో కుమార్తె, ఏఈఓగా విధులు నిర్వర్తిస్తున్న యువతి రావినూతలకు చెందిన తన సమీప బంధువును గతనెల 22న ప్రేమ వివాహం చేసుకుంది. తమ నిర్ణయానికి విరుద్ధంగా కుమార్తె వివాహం చేసుకోవడంతో మనస్తాపానికి గురైన విజయలక్ష్మి.. శనివారం ఉదయం శ్రీనివాసరావు బోనకల్‌లో ఉంటున్న తమ పెద్దకుమార్తె వద్దకు వెళ్లగా.. ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇదే సమయాన ఇంటి పక్కన మహిళ వచ్చి పిలిచినా పలకక పోవడంతో తలుపు తీసి చూడగా విజయలక్ష్మి ఫ్యాన్‌కు వేలాడుతోంది. దీంతో స్థానికుల సాయంతో కిందకుదించగా అప్పటికే ప్రాణాలు కోల్పోయింది. ఘటనపై శ్రీనివాసరావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధుబాబు తెలిపారు.

పలువురి సంతాపం

విజయలక్ష్మి మృతదేహం వద్ద ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌రావు, జెడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజు, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తదితరులు నివాళులర్పించి శ్రీనివాసరావు కుటుంబీకులను పరామర్శించారు. అలాగే, న్యాయవాది బి.తిరుమల్‌రావు, వివిధ పార్టీల నాయకులు బానోత్ కొండ, వేమూరి ప్రసాద్, చేబ్రోలు మల్లికార్జున్, మోదుగుల నాగేశ్వరరావు, తమ్మారపు బ్రహ్మయ్య, బంధం నాగేశ్వరరావు, పైడిపల్లి కిశోర్, పిల్లలమర్రి నాగేశ్వరరావు కూడా నివాళులర్పించారు. కాగా, వైద్యాధికారితో జెడ్పీ చైర్మన్ తదితరులు మాట్లాడి ముష్టికుంట్లలోనే విజయలక్ష్మి మృతదేహానికి పోస్టుమార్టం చేయించారు.

గుండెపోటుతో ఖమ్మం జైలు ఉద్యోగి మృతి


ఫకీర్ అహ్మద్ (ఫైల్)

తల్లాడ: ఖమ్మం జైలులో హెడ్‌వార్డర్‌గా విధులు నిర్వర్తిస్తున్న షేక్ ఫకీర్‌అహ్మద్ (58) శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. తల్లాడ మండలం మల్లవరానికి చెందిన ఆయన జైలులో గురువారం రాత్రి విధులు నిర్వర్తించాక శుక్రవారం ఉదయం స్వగ్రామానికి వచ్చాడు. ఒంట్లో నలతగా ఉండటంతో కల్లూరులో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న తన కుమారుడికి ఫోన్ చేసి అక్కడకు వెళ్లగా ఆస్పత్రిలో చూపించారు. ఆ తర్వాత కుమారుడి ఇంటికి వచ్చిన ఆయనకు రాత్రి గుండెపోటు రావడంతో మృతి చెందాడు. ఈ మేరకు శనివారం ఉదయం మల్లవరంలో అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, ఫకీర్ జైళ్ల శాఖలో చేరే ముందు ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ఆయన మృతదేహం వద్ద ఖమ్మం జిల్లా జైలు సూపరింటెండెంట్ శ్రీధర్, జైలర్ లక్ష్మీనారాయణ, కల్లూరు ఎస్‌ఐ ఎస్‌కే షాకీర్, కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్, మేకల మల్లిబాబుయాదవ్, దిరిశాల నరసింహారావు, దుండేటి వీరారెడ్డి, దగ్గుల రఘుపతిరెడ్డి, పాట్టేటి జనార్దన్‌రెడ్డి, పగడాల లచ్చిరెడ్డి, రాయల రాము, కటికి కిరణ్‌కుమార్ తదితరులు నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


రాజేశ్ (ఫైల్)

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెంనకు చెందిన వేముల రాజేశ్ (19) శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వేముల రాజేశ్, వేముల రాము, సాయి గురువారం ముచ్చింతల నరేశ్ వ్యాన్‌లో భద్రాచలం వెళ్లారు. అక్కడ మిర్చి కొనుగోలు చేసి శనివారం వస్తుండగా డ్రైవర్ నరేశ్ అతివేగంగా నడపడంతో నరసింహారావుపేట వద్ద వ్యాన్ బోల్తా పడింది. దీంతో తీవ్రంగా గాయపడిన రాజేశ్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఘటనలో రాము, సాయి సైతం గాయపడ్డారు. రాజేశ్ తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కొండల్‌రావు తెలిపారు.

మరో వ్యక్తికి తీవ్రగాయాలు

పెనుబల్లి: రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఏపీలోని తిరువూరు రాజుపేటకు చెందిన షేక్ హాజీ స్కూటీపై శనివారం వీఎం బంజర్‌కు రాగా, ఎస్‌బీఐ ఎదురుగా యూటర్న్ తీసుకుంటున్నాడు. అదే సమయాన ఎర్రగుంటవైపు నుంచి వీఎం బంజర్ వస్తున్న వాహనదారుడు ఢీకొట్టాడు. ఈ ఘటనలో హాజీకి తీవ్రగాయాలు కాగా పెనుబల్లి ఆస్పత్రికి తరలించారు.

పాముకాటుతో కోమాలోకి..

తిరుమలాయపాలెం: మండలంలోని హస్నాబాద్‌లో ఓ యువతిని పాము కాటు వేయడంతో కోమాలోకి వెళ్లింది. గ్రామాని కి చెందిన మాగి వెంకన్న – లక్ష్మి కుమార్తె స్పందన శుక్రవారం రాత్రి ఇంట్లో ఉక్కపోతగా ఉండటంతో పక్కింటి డాబాపై నిద్రించింది. శనివారం తెల్లవారుజామున ఆమెను పాటు కాటు వేయగా అరుస్తుండడంతో స్థానికులు ఖమ్మం తరలించారు. ప్రస్తుతం ఆమె మెరుగైన చికిత్స చేయించేందుకు దాతలు చేయూతనివ్వాలని తల్లిదండ్రులు కోరారు.

మూగజీవాలు మృతి

కారేపల్లి: సెప్టిక్ ట్యాంక్‌లో పడి ఒక ఎద్దు, ఆవు మృతి చెందిన ఘటన మాధారం డోలమైట్‌మైన్ టౌన్‌షిప్‌లో శనివారం చోటు చేసుకుంది. గుంపెళ్లగూడెం గ్రామానికి చెందిన ఆంబోతు(దేవుడి ఎద్దు), కొత్తతండా కు చెందిన రైతు భూక్యా ఇంద్లా ఆవులు టౌన్ షిప్‌లో మేతకు వెళ్లాయి. ఈ క్రమంలో అక్కడి సెప్టిక్ ట్యాంక్‌లో పడగా బయటకు రాలేక మృతి చెందాయి.

లక్ష్య సాధనే ధ్యేయంగా ముందుకెళ్లాలి

బొమ్మ ప్రీమియర్ లీగ్‌లో సినీనటి అనన్య


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న హీరోయిన్ అనన్య, పక్కన చైర్మన్ రాజేశ్వరరావు తదితరులు

ఖమ్మంఅర్బన్: విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని ఎంచుకుని దాన్ని సాధించడమే ధ్యేయంగా ముందుకెళ్లాలని, జయాపజయాలతో సంబంధం లేకుండా ముందుకెళ్తే విజయం సొంతమవుతుందని సినీ నటి అనన్య నాగళ్ల సూచించారు. ఖమ్మంలోని బొమ్మ కాలేజీలో జరుగుతున్న బొమ్మ ప్రీమియర్ లీగ్‌లో భాగంగా శనివారం టెక్నికల్, కల్చరల్ ఫెస్ట్ నిర్వహించారు. కార్యక్రమంలో అనన్య ముఖ్య అతిథిగా మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థి శ్రద్ధగా చదువుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. అనంతరం బొమ్మ విద్యాసంస్థల చైర్మన్ బొమ్మ రాజేశ్వరరావు, వైస్ చైర్మన్ సత్యప్రసాద్‌తో పాటు ఉదారు శ్రీధర్, బొమ్మ లక్ష్మీరాజ్యం, బొమ్మ అనుష మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నత స్థానాలకు చేరుకునేలా నాణ్యమైన బోధన అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాళ్లు పబ్బతి విజయరావు, రంజిత్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన ద్విచక్ర వాహనం

ఐదుగురు విద్యార్థులకు స్వల్పగాయాలు

కారేపల్లి: విద్యార్థులను ఎక్కించుకొని వస్తున్న ఆటోను ఎదురుగా ద్విచక్రవాహనం అదుపుతప్పి ఢీకొట్టడంతో ఆటో రోడ్డు కిందికి దూసుకెళ్లింది. మండలంలోని ఇల్లెందు సోలార్‌ప్లాంట్ సమీపాన శనివారం ఈ ప్రమాదం జరిగింది. భాగ్యనగర్‌తండాకు చెందిన ఆటోడ్రైవర్ రోజు మాదిరిగానే ఐదుగురు విద్యార్థులను తీసుకుని ఇల్లెందులోని ఓ ప్రైవేట్ పాఠశాలకు తీసుకెళ్లి మధ్యాహ్నం తీసుకొస్తున్నాడు. సోలార్‌ప్లాంట్ సమీపాన ఎదురుగా వచ్చిన ఓ ద్విచక్రవాహనం అదుపుతప్పి ఢీకొట్టగా ఆటో రోడ్డు కిందకు దూసుకుపోయింది. డ్రైవర్ అప్రమత్తతో పెద్దప్రమాదం తప్పినా ఆటోలో ఉన్న విద్యార్థులకు స్వల్పగాయాలయ్యాయి. ఈ ఘటనలో ద్విచక్ర వాహనదారుడికి సైతం గాయాలు కాగా ఇల్లెందు ఆస్పత్రికి తరలించారు.

అగ్నిప్రమాదంలో మామిడి తోట దగ్ధం

బోనకల్: ఓ రైతు నిర్లక్ష్యంతో మామిడి తోట దగ్ధమైన ఘటన మండలంలోని చిరునోములలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నీలం రఘు తన ఆరెకరాల మామిడి తోటను అదే గ్రామానికి చెందిన గొల్ల పరుశురామ్‌కు లీజ్ ఇచ్చాడు. బోనకల్ బ్రాంచ్ కెనాల్‌కు పక్కనే ఉన్న మామిడి తోటలో వ్యాపారి శనివారం కూలీలతో మామిడి కాయలు కోయిస్తున్నాడు. ఇదే సమయాన సమీపంలోని రైతు మొక్కజొన్న దంటుకు నిప్పుపెట్టాడు. వడగాలులకు మంటలు ఎగిసిపడి మామిడి తోటకు అంటుకున్నాయి. దీంతో కూలీలు తోట నుంచి పరుగులు తీయగా.. ట్యాంకర్ తెప్పించి మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం కానరాలేదు. ఘటనలో తోటలోని మామిడి చెట్లు కాలిపోగా, రూ.2లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు.

‘ఇండిపెండెంట్’గా ప్రచారం !

వైరా: ఆయన న్యాయవాది.. రాజకీయాల్లో ధనప్రభావం లేకుండా సామాన్యులు సైతం చట్టసభల్లో అడుగు పెట్టాలనే ఉద్దేశంతో ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో దిగేందుకు సిద్ధమై ప్రచారం ప్రారంభించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంనకు చెందిన కటుకోజ్వల నాగేశ్వరరావు పదిహేనేళ్లుగా న్యాయవాద వృత్తిలో ఉన్నారు. స్వచ్ఛ రాజకీయాల కోసం పోటీకి సిద్ధమైన ఆయన సాదాసీదాగా ప్రచారం చేస్తుండటం ఆకట్టుకుంటోంది. ద్విచక్రవాహనంపై మైక్ ఏర్పాటు చేసుకుని ఫ్లెక్సీలు బిగించుకుని ప్రచారం చేస్తున్నారు. స్వచ్ఛ రాజకీయాల కోసం తనను గెలిపించాలని ఎక్కడ ఇద్దరు, ముగ్గురు కనిపించినా ఆగి కోరుతున్నారు. కాగా, అసెంబ్లీ ఎన్నికల్లోనూ కొత్తగూడెం నుంచి పోటీ చేసిన నాగేశ్వరరావు 455 ఓట్లు సాధించారు. ఖమ్మం పార్లమెంట్ పరిధిలో ఒంటరిగానే ద్విచక్రవాహనంపై తిరుగుతూ ప్రచారం చేస్తానని వెల్లడించిన ఆయన మూడు రోజుల్లో నామినేషన్ వేస్తానని తెలిపారు.


ద్విచక్రవాహనంపై నాగేశ్వరరావు

రూ.3.34 కోట్ల విలువైన ఆభరణాల గుర్తింపు

సరైన ఆధారాలు చూపడంతో తిరిగి అప్పగింత


ఆభరణాల ఆధారాలను పరిశీలిస్తున్న అధికారులు

నేలకొండపల్లి: లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో ఖమ్మం జిల్లా సరిహద్దు నేలకొండపల్లి మండలం పైనంపల్లి చెక్‌పోస్ట్ వద్ద శనివారం అధికారులు చేపట్టిన తనిఖీల్లో భారీ మొత్తంలో బంగారాన్ని గుర్తించారు. అయితే, ఆభరణాలు తీసుకెళ్తున్న వారి వద్ద అన్ని ఆధారాలు ఉండటంతో వదిలేశారు. ఓ ఆభరణాల సంస్థ హైదరాబాద్‌లోని షోరూం నుంచి పలు ప్రాంతాల షోరూంలకు రూ.3.34 కోట్ల విలువైన బంగారు ఆభరణాలను పంపిస్తోంది. ఈ మేరకు తనిఖీల్లో అధికారులు భారీగా ఆభరణాలు ఉండటంతో వాహనాన్ని అడ్డుకుని రెండు గంటల పాటు తనిఖీలు చేపట్టారు. విషయాన్ని జిల్లా నోడల్ అధికారి మధుసూదన్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సూచనలతో కూసుమంచి సీఐ జనార్దన్, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి జి.వేణుమనోహర్ చేరుకున్నారు. అయితే, హైదరాబాద్ షోరూంలో డెలివరీ, ఖమ్మంలోని బంగారం దుకాణాల ఆర్డర్‌కు సంబంధించి రశీదులు ఉండటంతో వాహనాన్ని పంపించారు. తనిఖీల్లో చెక్‌పోస్ట్ అధికారులు నరేశ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పవిత్రోత్సవాలు

మారెమ్మతల్లి ఆలయంలో ఏర్పాట్లు పూర్తి


వేడుకలకు సిద్ధమైన ఆలయం

ఖమ్మంరూరల్ : మండలంలోని రెడ్డిపల్లి శ్రీ మారెమ్మతల్లి అమ్మవారి ఆలయంలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ప్రధానార్చకులు కాశావజ్ఝల రామశర్మ, ఆలయ మేనేజర్ సూర్యదేవర శ్రీనివాస్ తెలిపారు. నేడు ఉదయం 8 గంటలకు గోపూజతో కార్యక్రమాలు ప్రారంభం అవుతాయని పేర్కొన్నారు. ఆ తర్వాత విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం తదితర పూజలు ఉంటాయని, 22వ తేదీన సామూహిక కుంకుమార్చన, చండీ హోమం తదితర కార్యక్రమాలు, 23న అమ్మవారికి అష్టోత్తర శత కలశాలతో మహా కుంభాభిషేకం తదితర పూజలు నిర్వహిస్తామని వివరించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

తెరుచుకున్న వృద్ధురాలి ఇంటి తాళం


నాగరత్నమ్మను పరీక్షిస్తున్న వైద్యసిబ్బంది

కామేపల్లి: మండలంలోని జాస్తిపల్లికి చెందిన వృద్ధురాలు మల్లెంపాటి నాగరత్నమ్మ ఇంటి తాళాన్ని స్థానికులు శనివారం పగలగొట్టారు. ఆమె చెల్లెలితో ఆభరణం విషయంలో వివాదంతో నాగరత్నమ్మ ఇంటికి తాళం వేయగా వారం రోజులుగా వరండాలోనే నివసిస్తోందని ‘వృద్ధురాలి ఇంటికి తాళం’శీర్షికన ‘సాక్షి’లో శనివారం కథనం ప్రచురితమైంది. దీంతో స్థానికులు తాళం పగలగొట్టి ఆమెను ఇంట్లోకి పంపించారు. ఆ తర్వాత వైద్య సిబ్బంది, ఐసీడీఎస్ అధికారులు చేరుకుని ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

సాక్షి ఎఫెక్ట్..

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా!
నా క్లయింటు అయిన కోన శారద, భర్త: గోవిందరావు, ఇ.నెం. 10-3-137/1, మామిళ్ళగూడెం, ఖమ్మం గారు వెలుగుమట్ల గ్రామ రెవెన్యూ సర్వే నెం. 494లో భూమి కలిగి ఉన్నారు. సదరు విషయాన్ని ధృవపరుస్తూ ప్లాట్ నెం. 47, 48లు నా క్లయింటు అయిన కోన శారదకు సంబంధించినవని మరెవరికి ఏ హక్కులు వాటిపై లేవని గుర్తిస్తూ, ఖమ్మం జిల్లా రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానం వారు O.S.No. 195/2013 లో జడ్జిమెంట్ మరియు డిక్రీద్వారా ఇచ్చియున్నారు. కావున సమస్త ప్రజానీకానికి తెలియజేయునది వెలుగుమట్ల గ్రామ సర్వే నెం. 494లో గల ప్లాట్ నెం. 47, 48లు నా క్లయింట్ కోన శారద గారివి మాత్రమే అని వేరెవరికి ఎలాంటి హక్కులేదని తెలియజేయనైనది.
ఇట్లు
మాసిని నాగరాజు
న్యాయవాది, ఖమ్మం.
సెల్: 9030965035.